మట్టి ప్రతిమ మేలు

- సెప్టెంబర్ 7 నుంచి వినాయక చవితి ఉత్సవాలు
- ఊరూవాడా కొలువుదీరనున్న బొజ్జ గణపయ్యలు

ప్రశాంతి నిలయం: సెప్టెంబర్ ఏడో తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఊరూవాడా లంబోదరుడి ప్రతిమలు కొలువుదీరి విశేష పూజలందుకోనున్నాయి. పంచ భూతాలలో ఒక్కటైన మట్టితో చేసిన వినాయకుడిని పూజించడంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని, పర్యావరణ హితం కూడా అని పండితులు చెబుతున్నారు. వివిధ రకాల ఆకులు, పుష్పాల సువాసనల నుంచి మిశ్రమ వాయువులు పీల్చడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు దూరం కావడంతో పాటు మెదడు ఉత్తేజితం అవుతుంది. ప్రకృతి సిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించడం, తిరిగి వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో అవి సులువుగా కరిగి పంట పొలాలకు చేరడంతో భూమి సైతం సారవంతంగా మారుతుంది. రసాయనాలు లేకపోవడంతో పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుంది.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వాడితే ముప్పే

వినాయక విగ్రహాల్లో 80 శాతం పైగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో తయారు చేస్తున్నారు. తక్కువ బరువుతో పాటు వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా తయారు చేసేందుకు అనువుగా ఉండటంతో పీఓపీ ప్రతిమల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రతిమలు ఏళ్ల గడిచినా భూమిలో కలిసిపోవు. విగ్రహాల తయారీలో ఎరువు రంగు కోసం మెర్క్యురీ సల్ఫేట్ వాడతారు. దీనివల్ల చర్మ వ్యాధులు, దద్దుర్లు వస్తాయి. నలుపు రంగు కోసం రెడ్ ఆక్సైడ్, క్యాడ్మియం వాడతారు. వీటి వల్ల గ్రహణ శక్తి తగ్గిపోతుంది. మూత్ర పిండాల ఇన్ఫెక్షన్, పిల్లల శారీరక, మానసిక ప్రవర్తనలో మార్పులు వస్తాయి. నీటి రంగు కోసం క్రోమియం, అయోడైడ్ వాడుతారు. వీటితో అలర్జీ, ఉబ్బసం, న్యుమోనియా వంటి వ్యాధులు వస్తాయి. గులాబీ రంగుకోసం పొటాషియం, డైక్రోమిట్ వాడుతారు. వీటితో చర్మ వ్యాధులు వచ్చే అవకాశం మెండుగా ఉంది.


వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధమైన ప్రతిమలు

విధి లేక పీఓపీ ఉత్పత్తులు



“విభిన్న రూపాల్లో విగ్రహాలు తయారు చేయడం కోసం విధిలేని పరిస్థితుల్లో పీఓపీ వాడాల్సి వస్తోంది. ఏటా 300 వరకు విగ్రహాలు అమ్ముతున్నాం. 6 అడుగుల నుంచి 15 అడుగుల ఎత్తు వరకు ఉండే వినాయక ప్రతిమలు తయారు చేస్తాం. ఈ ఏడాది 300 విగ్రహాలు తయారు చేయడం జరిగింది.ఇప్పటి వరకు 100 మాత్రమే బుక్ ఆయ్యాయి.గత ఏడాది కంటే ఈ ఏడాది కొంత ఉత్సాహం తగ్గినట్లు అనిపిస్తోంది.”

– శివకుమార్, వినాయక ప్రతిమల తయారీదారుడు, బుక్కపట్నం

పీఓపీ విగ్రహాలు నిషేధించాలి



పీఓపీ విగ్రహాలను పూర్తిగా నిషేధిస్తేనే పర్యావరణ సమతుల్యత సాధించవచ్చు. పీఓపీ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తే తొందరగా కరగవు. దీని వల్ల నీటి కాలుష్యం జరుగుతుంది. అంతే కాకుండా నీటిలో ఉన్న ఆక్సిజన్ స్థాయి పూర్తిగా తగ్గిపోతుంది. చేపలు, క్రిమి కీటకాలతో పాటు చుట్టూ ఉన్న పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు దీనిపై దృష్టిసారించాలి.

– నాగిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పర్యావరణ శాస్త్ర విభాగం, శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల

మట్టి విగ్రహాలనే వాడాలి



పర్యావరణ హితంగా ఉండాలంటే మట్టి విగ్రహాలనే పూజించాలి. యువత మేల్కొని మట్టి విగ్రహాల కొనుగోలుపైన ఆసక్తి పెంపొందించుకోవాలి. మట్టి విగ్రహాలను కొనుగోలు చేసి వాటిని పూజించి తర్వాత నీటిలో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణ, నీటి, భూమి సమతుల్యతలు సమృద్ధిగా ఉంటాయి. మట్టి విగ్రహాలను తయారు చేయించి వాటిని కొనుగోలు చేయడం ద్వారా పలువురికి ఉపాధి లభిస్తుంది.

–శ్రీదేవి, అధ్యాపకురాలు, పెనుకొండ ప్రభుత్వ కళాశాల

క్లుప్తంగా

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం


శిబిరంలో పాల్గొన్న అధికారులు, రైతులు

కదిరి అర్బన్: మొటుకుపల్లి గ్రామంలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డా. సుధాకర్ మాట్లాడుతూ పెయ్య దూడలు మాత్రమే ఇవ్వగలిగే లింగ నిర్ధారిత వీర్యం కోసం శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 90 శాతం ఖచ్చితత్వంతో పెయ్య దూడల పుట్టుకకు ఈ పథకం తోడ్పడుతుందన్నారు. అనంతరం 33 పశువులకు గర్భకోశపరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు 12 పశువులకు తాపారు. పట్నం వెటర్నరీ డాక్టర్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

బత్తలపల్లి: శ్రావణ మాసంలో చివరి శుక్రవారం సందర్భంగా మండలవ్యాప్తంగా వరలక్ష్మి వ్రతంను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఇళ్లల్లో కలశం స్థాపించి అందులో లక్ష్మిదేవిని ఆవాహన చేసి షోడశోపచారాలతో పూజించారు. అనంతరం విఘ్న నివారణకై గణపతి పూజను నిర్వహించారు. అనంతరం పూజకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేపట్టారు. మండల కేంద్రంలోని కొల్లాపురమ్మ తల్లి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ముష్టూరు శివాలయంలో వరలక్ష్మి వ్రతం చేపట్టారు. వేద పండితులు చంద్రశేఖర్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, ధనుంజయశర్మ వరలక్ష్మి వ్రత విశిష్టతను వివరించారు.

ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున



ధర్మవరం : ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జునను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌ను బదిలీ చేశారు. మల్లికార్జున గతంలో ఇక్కడే కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం మరోసారి కమిషనర్‌గా వస్తుండటంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వన్ స్టాప్ సెంటర్‌తో మహిళలకు భరోసా


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి వన్ స్టాఫ్ సెంటర్‌తో మహిళలకు భరోసా లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తారకరామాపురంలోనున్న కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా సాధికారిక శాఖ కోఆర్డినేటర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో శక్తి వన్ స్టాఫ్ సెంటర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ వన్‌స్టాఫ్ సెంటర్ కౌన్సిలర్ కరిష్మా, పారా మెడికల్ ఆఫీసర్ రమాజ్యోతి మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు, పిల్లల అభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వన్ స్టాఫ్ సెంటర్లను దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిందన్నారు. కళాశాల అధ్యాపకులు త్రివేణి, షమీఉల్లా, గోపాల్‌నాయక్, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పావతి, ఆనంద్, సరస్వతి పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపు

ముదిగుబ్బ: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ముదిగుబ్బ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణుని ప్రతిమను పల్లకిలో ఊరేగించారు. మండల స్థాయి అధికారులంతా పాల్గొని తమ భక్తి భావం చాటుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వేదిక ముదిగుబ్బ కమిటీ అధ్యక్షుడు విశ్వమూర్తి, సభ్యులు సురేష్, భీమరాజు, రత్నమాచారి, చిన్నప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన


మాట్లాడుతున్న ఎంఈఓ అరుణమ్మ

కనగానపల్లి: ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఎంఈఓ అరుణమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్య భద్రతపై అధికారులు మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్ల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది బాధ్యత తీసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీదేవి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మెన్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

తనకల్లు: మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని అధికారులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటి వాటిని జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ, ఎఫ్ఆర్ఓ గుర్రప్ప, ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి, డీవైఆర్ఓ రామచంద్రానాయక్, ఎఫ్ఎస్ఓలు రామచంద్రారెడ్డి, దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించుకోవాలని తహసీల్దార్ నరేంద్రకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మనోహర్ సూచించారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ఎస్.పీ.కుంట–1, 2 సచివాలయాల వద్ద స్థానిక సర్పంచ్ ఆంజనమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న పరిస్థితులలో అంతరించిపోతున్న అడవులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఏపీఓ చంద్రశేఖర్, పంచాయితీ కార్యదర్శులు రమేష్, ముబారక్, రెడ్డిభాస్కర్, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


తనకల్లు ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న అధికారులు, విద్యార్థులు

కదిరి అర్బన్: స్థానిక వీవర్స్ కాలనీలో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమం చేపట్టారు. ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్ రెడ్డి హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనగానపల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించాలని సీడీపీఓ కవితాదేవి తెలిపారు. తగరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. మండలంలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు వనమహోత్సవం నిర్వహించారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

ధర్మవరం: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం తీసుకురావడం దారుణమన్నారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, 117 జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ నటరాజ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, ఆంజనేయులు, అమర్‌నారాయణరెడ్డి, హరికృష్ణ, సాయిగణేష్, రాంప్రసాద్, సకల చంద్రశేఖర్, బిల్లే రామంజనేయులు, బి.ఆంజనేయులు, జనార్ధన్‌బాబు, కృష్ణతేజ, బాలాజీ, నారాయణస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్) విధానాన్ని వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూపీఎస్‌ను రద్దు చేసిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం ఖాతరు చేయకుండా సీపీఎస్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం అన్యాయమన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మురళీకృష్ణకు అందజేశారు. నాయకులు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, సీఐటీయూ నాయకులు నరసింహ, సాంబశివ, జగన్, బాబ్జాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధర్మవరంలో నిరసన తెలుపుతున్న నాయకులు

పుట్టపర్తి అర్బన్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా శుక్రవారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూపీఎస్ లాంటి అంకెల గారడీ చేసే పెన్షన్ స్కీము వద్దని, పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరించాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివ కందుకూరి, లక్ష్మీనారాయణ, బాబయ్య, కృష్ణ, రవీంద్రారెడ్డి, సురేష్, రమేష్, రాజేష్, బాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘సత్యసాయి’ కార్మికుల సమ్మె

బత్తలపల్లి: డిమాండ్ల సాధన కోసం సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ ట్యాంకు వద్ద మండలంలో పని చేస్తున్న సత్యసాయి కార్మికులు మోకాళ్ల మీద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతను కల్పించాలని, పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జగన్ మారుతి, బాషా, షేక్ మహబూబ్‌బాషా, కేశవ, సద్గురు, అనంతయ్య, మురుగేష్, రామ్మోహన, జయరాము, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: పెండింగ్‌లో ఉన్న ఆరు నెలలుగా జీతాలు వెంటనే అందించాలని సత్యసాయి తాగు నీటి పథకం కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. తాడిమర్రిలోని మద్దులచెర్వు తాగునీటి సంపు వద్ద కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు క్యాండిల్స్ పట్టుకుని నిరసన తెలిపారు. కార్మిక సంఘం నాయకులు కే.పెద్దఓబిలేసు, నాగార్జున, చిన్నఓబిలేసు, తిరుపాలు, లక్ష్మీనారాయణ, రాములప్ప తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం తొమ్మిదో రోజు సత్యసాయి నీటి పథకం కార్మికులు స్థానిక పంప్ హౌస్ వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. శ్రీ సత్యసాయి వాటర్ సప్‌లై ప్రాజెక్టును కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికులు వెంకటేసు, శ్రీనివాసులు, శంకర, నాగభూషణ, షామీర్, రాంమోహన్‌రెడ్డి, కేశవ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నల్లమాడలో ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న కార్మికులు

ముదిగుబ్బ: పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అందులో భాగంగా శుక్రవారం కార్మికులంతా సత్యసాయి బాబా చిత్ర పటానికి వినతి పత్రం అందజేశారు. కార్మికులు రాజా, గోపాల్ రెడ్డి, చంద్ర, గోపాల్ నాయక్, బాలకృష్ణ, ముత్యాలప్ప, ధర్మానాయక్, అల్లిపీరా, గంగాధర్, రమేష్, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కదిరి అర్బన్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అంజనప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు ఎంపీడీఓ మాట్లాడారు. పారిశుధ్యం, తాగు నీటి సరఫరాలో లీకేజీలు లేకుండా చూడాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. పింఛన్ల పంపిణీని 31న తెల్లవారుజామున 5 గంటల నుంచే ప్రారంభించాలన్నారు. గత నెలలో సమష్టి కృషితో జిల్లాలో మన మండలం పింఛన్ పంపిణీలో ప్రథమ స్థానం దక్కిందన్నారు. అంతకు మునుపు ఉత్తమ సేవలకు గాను ఆగస్టు 15న అవార్డులు అందుకున్న ఎంపీడీఓ,ఏఓ నారాయణలను ప్రజాప్రతినిధులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ శాఖల ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. జెడ్పీటీసీ రాధాబాయ్, వైస్ ఎంపీపీ ఆనందనాయక్‌తో పాటు సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.


ఎంపీడీఓ అంజనప్ప, ఏఓ నారాయణను సన్మానిస్తున్న దృశ్యం

అలవెన్సులు పునరుద్ధరించాలని నిరసన

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల నెలవారి జీతంలో రావాల్సిన అలవెన్స్‌లను ట్రెజరీ అధికారులు నిలుపుదల చేయడం సరికాదని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ నాయకులు ప్రేమ్‌కుమార్, రీజనల్ చైర్మన్ ముత్యాలప్ప పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండక్టర్లకు, డ్రైవర్లకు నైట్ అవుట్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలని, జీఓ 114లోని అలవెన్స్‌లను అమలు చేయాలన్నారు. అసోసియేషన్ డిపో చైర్మన్ హనుమాన్, కార్యదర్శి మధు, గ్యారేజి అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి హరి, సీనియర్ నాయకులు ఎస్ఎంసాబ్, పీఎస్‌ఖాన్, వైవీఎస్‌రెడ్డి, మోహన్, దుర్గాప్రసాద్, ఎంసీజీ రావు, నాయక్, గౌడ్, కోమలాదేవి, జాన్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: ఆర్టీసీలో రద్దు చేసిన అలవెన్సులను పునరుద్ధరించాలని శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి గేట్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎలాంటి అలవెన్సులు రద్దు చేసిందన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులు, మెడికల్ బిల్లులు చెల్లించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ, డిపో చైర్మన్ నారాయణస్వామి, కార్యదర్శి బైరిశెట్టి, రామచంద్ర, బాబ్జీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


కదిరిలో నల్లబ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అంతర్జాతీయ వెబినార్

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వెబినార్ జరిగింది. అమెరికాలో మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో విద్యనభ్యసించిన డాక్టర్ ముద్దూరి ఆశోక్‌వర్ధన్‌రెడ్డి జీవ రసాయన శాస్త్రంలో జరుగుతున్న పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు తెలియజేశారు. రసాయన శాస్త్ర విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, రసాయనశాస్త్ర అధ్యాపకుడు డా.యూ.వి సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బసంపల్లిలో వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని 104 వైద్య సిబ్బంది సూచించారు. బసంపల్లిలో శుక్రవారం 104 వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రశాంత్ దోమల నివారణ చర్యలును వివరించారు. సూపర్‌వైజర్ వెంకట నారాయణ, సీహెచ్ఓ సాయిలీల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘వికసిత్ ఏపీ’పై సమీక్ష

ఓడీచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వికసిత్ ఏపీ కార్యక్రమంపై మండల పరిషత్ ఏఓ రెడ్డప్ప ఆధ్వర్యంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏఓ కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలన్నారు. ఎంఈఓ సురేష్, ఇతర అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

8న కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 8న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్ర రెడ్డి తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో శుక్రవారం కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కదిరి అర్బన్: వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో కోరింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక పోలీస్ శాఖ సూచనలు తప్పక పాటించాలని సూచించింది. నిర్వాహకులు నమోదు చేసిన వివరాల ఆధారంగా పోలీస్ శాఖ అనుమతి పత్రం మంజూరు చేస్తుందని పేర్కొంది.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ధర్మవరం రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ పిట్టా నరసమ్మ అన్నారు. శుక్రవారం గొట్లూరులో సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీలను శుభ్రం చేశారు.

డ్రై డే పాటించండి

ధర్మవరం రూరల్: ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి దోమలను నివారించుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామ్‌నాయక్ ప్రజలకు సూచించారు. శుక్రవారం దర్శినమల, వెంకటతిమ్మాపురంలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి దోమల నివారణపై అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కొల్లాపురమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే భక్తిశ్రద్ధలతో హోమం చేపట్టారు. సాయంత్రం దేవతామూర్తి విగ్రహాన్ని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. శుక్రవారం ఉదయం అమ్మవారి మూల విరాట్‌ను వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అంతకు ముందు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తండ్రి తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి అమ్మవారికి పూజలు చేశారు.


పూజల్లో పాల్గొన్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు పండ్లు అందిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సెల్వియా సాల్మన్

ధర్మవరం అర్బన్: పౌష్టికాహారంతోనే గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ సెల్వియా సాల్మన్ పేర్కొన్నారు. పట్టణంలోని దుర్గానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యురాలు సాయి చంద్రిక, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు చిన్నప్ప, జింకా చిన్నప్ప, మంజునాథ్, వేణుగోపాల్, రామకృష్ణ, మనోహర్‌గుప్త, చంద్రశేఖర్, సాయిప్రసాద్, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా నాగేంద్రప్రసాద్



ధర్మవరం అర్బన్: స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా నాగేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం నంద్యాల జిల్లా నందికొట్కూరు రూరల్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తాడిపత్రి అర్బన్ సీఐగా పని చేస్తున్న నాగేంద్రప్రసాద్‌ను నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానని నూతన సీఐ పేర్కొన్నారు. ఈసందర్భంగా సీఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి

ధర్మవరం అర్బన్: ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లిలో దళిత రాజు కుటుంబంపై దాడి చేయడంతో రాజు, అతని భార్య ఇద్దరూ గాయపడ్డారన్నారు. దాడి జరిగి వారంరోజులు గడిచినా ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. ముదిగుబ్బలో దళితులైన చిన్న నాగమ్మ, కుమారుడు సుదర్శన్‌పై అగ్రకులాల వారు దాడి చేశారని వాపోయారు. దాడులు జరిగి ఆసుపత్రిలో ఉంటే వారిపైనే కౌంటర్ కేసులు పెడతామని భయపెట్టడం సరికాదన్నారు. జేఏసీ నాయకులు రామకృష్ణ, నాగరాజు, ఆది, గోపాల్, వెంకటేషులు, నారాయణ, బాధితులు రాజు, చిన్న నాగమ్మ, సుదర్శన్, మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం


పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, సిబ్బంది

ప్రశాంతి నిలయం: ధూమపానం మనిషి ఆరోగ్యానికి హానికరమని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఆవరణలో ధూమపానం వల్ల కలిగే అనర్థాలను తెలియజేసే ఉద్దేశంతో రూపొందించిన పోస్టర్లను సిబ్బందితో కలసి డీఎంఅండ్‌హెచ్ఓ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలకు 300 మీటర్ల దూరం వరకూ పొగాకు పదార్థాలను విక్రయించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం చట్ట రీత్యా నేరమన్నారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని వివిధ ప్రోగ్రాంల అధికారులు పాల్గొన్నారు.